తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, బీఆర్‌ఎస్ నేతలు పొన్నాల, దాసోజు

కేసీఆర్ రైతుబంధు.. రేవంత్ రాబందు!

మొదటిపేజీ తరువాయి...

సంస్థల ఎన్నికల గండాన్ని దాటేందుకే రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటన చేసిందని విమర్శించారు. ఈ ద్రోహాన్ని రైతులు క్షమించబోరని హెచ్చరించారు. రైతు భరోసాపై మాట మార్చినందుకు కాంగ్రెస్ నాయకులు ప్రజాక్షేత్రంలో ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో ఆదివారం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తాటికొండ రాజయ్య, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, పార్టీ నేత దాసోజు శ్రవణ్‌తో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. మొదటి నుంచి బీఆర్‌ఎస్ అనుమానించినట్టే రైతులను కాంగ్రెస్ మళ్లీ మోసగించిందని విమర్శించారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 75 ఏండ్ల సంబురాల సందర్భంగా దశాబ్దాలుగా కాంగ్రెస్ చేతిలో రైతులు మోసపోతూనే ఉన్నారని నిప్పులు చెరిగారు.

15 వేలు ఇస్తామని చెప్పి 12 వేలే అంటూ సవాలక్ష కండీషన్లు పెట్టి జనవరి 26న రైతు భరోసా మోసానికి అధికారికంగా తెరలేపున్నదని మండిపడ్డారు. నమ్మి ఓటేసిన పాపానికి పచ్చి మోసానికి పాల్పడ్డ కాంగ్రెస్‌ను రైతులే పాతరేస్తారని హెచ్చరించారు. రైతాంగానికి కాంగ్రెస్ చేసిన ద్రోహం.. తెలంగాణ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోతదని ఫైర్ అయ్యారు.

> **రేవంత్ నుంచి రాహుల్‌గాంధీ దాకా రైతులకు చెప్పిందేమిటి.. చేసిందేమిటి? ఇచ్చిన మాట తప్పడమే ఇందిరమ్మ రాజ్యమా? రైతులకు తీరని ద్రోహం చేసినందుకు తెలంగాణ ప్రజాక్షేత్రంలో రేవంత్ ముక్కు నేలకు రాయాలె. నమ్మించి నయవంచన చేసినందుకు 70 లక్షల మంది రైతులకు రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలె. మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రధాన హామీని నిలబెట్టుకోనందుకు రైతల ముందు సీఎం చెంపలేసుకోవాలె. -కేటీఆర్**

కపట నాటకాలకు కేరాఫ్ కాంగ్రెస్

కపట నాటకాలకు, నోరు తెరిస్తే అబద్ధాలకు, బూటకపు వాగ్దానాలకు కేరాఫ్‌గా కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి నిలిచారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. టీపీసీసీ చీఫ్ హోదాలో, ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్‌గాంధీ చెప్పిన మాటల వీడియోలను మీడియాకు వినిపించారు. 75-80 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద రూ.17 వేలు ఇస్తామని.. కౌలు రైతులు, భూయాజమానుల మధ్య ఎలాంటి ఇబ్బంది లేకుండా భరోసా కల్పిస్తామని, బీఆర్‌ఎస్ రూ.10 వేలు భిక్షమేస్తే.. రైతుల ఆత్మగౌరవం పెంచేందుకు రూ.15 వేలు రైతుభరోసా కింద ఇస్తామని రేవంత్‌రెడ్డి చెప్పిన వీడియో క్లిప్పింగ్‌ను, ఎకరాకు 15 వేల చొప్పున రైతులకు ఇస్తామని, ఇది రైతులకు ఇచ్చే డిక్లరేషన్ కాదు..రైతులకు కాంగ్రెస్ ఇచ్చే గ్యారెంటీ అని రాహుల్‌గాంధీ అన్న మాటలను వినిపించారు. ఇలా తెలంగాణ రైతులను రేవంత్‌రెడ్డితోపాటు రాహుల్‌గాంధీ సైతం మోసం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ చరిత్రలో రేవంత్ రైతుద్రోహిగా మిగిలిపోతారని నిప్పులుచెరిగారు.

అప్పులపాలైందని దుష్ప్రచారం

దేశంలోనే ధనిక రాష్ట్రం తెలంగాణ అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన రేవంత్‌రెడ్డి, అధికారంలోకి రాగానే రాష్ట్రం అప్పులపాలైందని ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని మోసం చేశారని, కుంటి సాకులతో తప్పించుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. మంత్రులు బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అబద్ధాలు చెప్తున్నారని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కాదు.. కాంగ్రెస్ నేతల మానసిక పరిస్థితే బాగాలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని నాశనం చేసింది రేవంత్‌రెడ్డేనని, మూర్ఖపు నిర్ణయాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అతలాకుతలమైందని మండిపడ్డారు. రాష్ట్రానికి ఆర్థిక ఇంజిన్‌గా ఉన్న హైదరాబాద్‌లో హైడ్రా, మూసీ నిర్ణయాలతో రియల్ ఎస్టేట్ పడిపోయిందని విమర్శించారు. మూడు పరిశ్రమలు ఇతర నగరాలకు వెళ్లిపోయాయని చెప్పారు.

420 హామీల పరిస్థితి ఏంటీ?

హామీలు అమలు చేయాలంటే తప్పుడు కేసులు పెడుతున్నారని, కాంగ్రెస్ 420 హామీల పరిస్థితి ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. ఎవరిని మోసం చేయడానికి ఇన్ని హామీలిచ్చారో చెప్పాలని డిమాండ్‌చేశారు. కేసీఆర్ ప్రభుత్వం అప్పులు చేసి కాళేశ్వరం, మిషన్‌భగీరథ, రోడ్లు, ఫ్లైఓవర్లు, సచివాలయం, మెడికల్ కాలేజీలు, కలెక్టరేట్లు నిర్మించిందని, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్షల కోట్ల అప్పులతో ఏం అభివృద్ధి చేసిందని నిలదీశారు. ఏడాదిలో రూ.లక్షా 38 వేల కోట్ల అప్పులు చేశారని, ఆ డబ్బును ఢిల్లీకి మూటలుగా పంపుతున్నారా? అని ప్రశ్నించారు.

ఆర్థిక పరిస్థితిపై చర్చకు సిద్ధమా

తెలంగాణ ఆదాయ మిగులు రాష్ట్రమని, అంకెలు మాయచేయవని కేటీఆర్ స్పష్టంచేశారు. పైసల్లేవని పచ్చి అబద్ధాలు చెప్పడం మానాలని రేవంత్‌కు హితవుపలికారు. 'దివాళా తీసింది తెలంగాణ కాదు. దివాళా తీసింది రేవంత్‌రెడ్డి మెదడు. రూ.5,943 కోట్ల రెవెన్యూ మిగులుతో రాష్ట్రాన్ని అప్పగించాం. రాష్ట్రానికి మొత్తం అవసరమయ్యే నెలవారీ ఖర్చు రూ.22,500 కోట్లు అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నా, రాష్ట్రానికి అందే మొత్తం రూ.24,234.64 కోట్లు. అంటే రాష్ట్రానికి నెలకు అదనంగా రూ.1,734.6 కోట్లు అందుబాటులో ఉంటాయి. వాస్తవాలు స్పష్టంగా కనిపిస్తుంటే ఇలా అబద్ధాలు చెప్పవచ్చా?' ఆర్థిక పరిస్థితి బాగా లేదని చెప్పడానికి సిగ్గనిపిస్తలేదా? తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై చర్చకు సిద్ధమా?' అని కేటీఆర్ సవాల్ విసిరారు. 'అధికార పీఠం మీద కూర్చొని చేతకాని మాటలు చెప్తారా? కేసులు పెట్టడం, రాష్ట్ర ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం.. ఇదేనా మార్పు?' అని ప్రశ్నించారు. 'కడుపు కట్టుకుంటే రూ.40 వేల కోట్లు వస్తాయని రేవంత్ అన్నరు. మరి ఏమైంది? రుణమాఫీ అందరికీ ఎందుకు చేయలేదు?' అని నిలదీశారు. రైతు భరోసా 12 వేలకు కుదించి సంబురాలు చేయాలని కాంగ్రెస్ చెప్తున్నదని, ఎందుకు సంబరాలు చేయాలని కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ అబద్ధాలకు డిక్షనరీలో కొత్త పదాలు వెతకాలని ఎద్దేవాచేశారు.

ఎక్కడికక్కడ నిలదీయాలి

రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ గ్రామాల్లో కాంగ్రెస్ నేతలను ప్రజలు నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. అన్ని జిల్లా, మండల, నియోజకవర్గ కేంద్రాల్లో రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి నిరసనలు తెలుపుతామని చెప్పారు. 'హార్టికల్చర్ రైతులకు, ఉద్యోగులకు రైతు భరోసా ఇస్తారా? ఇవ్వరా? అనే దానిపై క్లారిటీ లేదు. భూమితో ఉద్యోగులకు సంబంధం లేకుండా చేయాలనే ప్రయత్నం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గండం గట్టెక్కేందుకే రైతు భరోసాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. రైతుబంధు పథకం ఉండాలా? వద్దా? అనేది రైతులు నిర్ణయం తీసుకోవాలి. గ్రామాల్లో కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకోండి' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

ధోకాలకు కేరాఫ్ కాంగ్రెస్ సర్కార్

రైతు భరోసాలో 'రైతు' అనే పదాన్ని మాయం చేసి ఇందిరమ్మ భరోసా పేరు పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి రైతు ద్రోహి అని కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తీరు 'ఒడ్డెక్కేదాకా ఓడ మల్లన్న.. ఒడ్డెక్కాక బోడి మల్లన్న' అన్న చందాన ఉన్నదని ఆదివారం ఎక్స్‌వేదికగా విమర్శించారు. రూ.15 వేల రైతు భరోసా ఇస్తామన్న వరంగల్ డిక్లరేషన్ అబద్ధమని, రాహుల్ గాంధీ ఓరుగల్లు ప్రకటన బూటకమని ధ్వజమెత్తారు. ఇది సర్కారు కాదని, మోసగాళ్ల బెదిరింపుల మేళా అని విమర్శించారు. అబద్ధానికి అంగీ లాగు వేస్తే అది కాంగ్రెస్ అని, మోసానికి మేకప్ వేస్తే అది కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు.

'అక్కరకు రాని చుట్టము
మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమునదా
నెక్కిన బారని గుర్రము
గ్రక్కున విడువంగ వలయు గదరా సుమతీ!'
అనే పద్యంతో రేవంత్ సర్కార్‌పై సెటైరికల్ ట్వీట్ చేశారు.

> **రైతు భరోసా 12 వేలకు కుదించి సంబురాలు చేయాలని కాంగ్రెస్ చెప్తున్నది. ఎందుకు సంబరాలు చేయాలి? రైతులకు ఎకరానికి రూ.15,000 ఇస్తమని చెప్పి కోతలు పెట్టినందుకా? ఎన్నికల్లో ఓట్ల కోసం మాయమాటలు చెప్పి మోసం చేసినందుకు క్షీరాభిషేకాలు చేయాలా? -కేటీఆర్**

ఎక్కడున్నవ్ రాహుల్?

తెలంగాణ ప్రజలకు కష్టమొస్తే వెంటనే వస్తానని వరంగల్ సభలో చెప్పిన రాహుల్‌గాంధీ, మరిప్పుడు తెలంగాణ ప్రజలు కష్టాల్లో ఉంటే ఆయన ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. రైతులు కాంగ్రెస్ పార్టీని ఎప్పటికీ క్షమించబోరని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత మోసం చేస్తుంటే రాహుల్‌గాంధీ ఏరి అని నిలదీశారు. కాంగ్రెస్ హామీలపై నిలదీస్తే దివాళాకోరు మాటలు చెప్తున్నారని మండిపడ్డారు.

తెలంగాణను కించపరిచేలా వ్యాఖ్యలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఉద్యోగుల పరిస్థితి బాగుండేదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం, సీఎం పదవిలో కూర్చొని తెలంగాణను కించపర్చడమేనని కేటీఆర్ విమర్శించారు. దేశంలోనే అత్యధిక జీతభత్యాలు ఇచ్చిన తెలంగాణ రాష్ట్రం గురించి రేవంత్ అవమానకరంగా మాట్లాడారని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ ఇచ్చింది బీఆర్‌ఎస్ సర్కారు కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దిగజారిందని రేవంత్ మాట్లాడడం ఉద్యోగులను అవమానపరచడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఎన్నికల హామీని అమలుచేయాల్సిందే

- వానకాలం పెట్టుబడి సాయంతో కలిపి ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాల్సిందే
- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల హామీల్లో ఒకటైన ఎకరాకు రూ.15వేల (ఏడాదికి) రైతుభరోసాను అమలుచేయాల్సిందేనని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. రూ.15 వేలు కాకుండా రాష్ట్ర క్యాబినెట్ రూ.12వేలు చెల్లిస్తామని నిర్ణయించడం మోసపూరితమని పేర్కొంది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి టీ సాగర్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైతుల ఆత్మహత్యలను అరికట్టేందుకు గత ప్రభుత్వం రైతుబంధు ప్రకటించిందని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతాంగం ఓట్లు ఆకర్షించేందుకు కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతు భరోసా కింద ఏటా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా వానకాలం సీజన్ రైతుభరోసా ఇవ్వకపోగా, ఇప్పుడు ఎకరాకు రూ.12 వేలే ఇస్తామని ప్రకటించడం అన్యాయమని పేర్కొన్నారు. క్యాబినెట్ పునరాలోచన చేసి ఏటా ఎకరాకు రూ.15 ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

రేవంత్ మోసపూరిత వైఖరిని నిలదీయాలి

బీఆర్‌ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఖరిని ప్రజలంతా నిలదీయాలని బీఆర్‌ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ విజ్ఞప్తిచేశారు. 'వరంగల్ రైతు డిక్లరేషన్‌ను అమలుచేయకుండా రైతులు, కౌలు రైతులను నయవంచనకు గురిచేస్తున్న రేవంత్ నిరంకుశ వైఖరిని ఖండించండి' అని ఆదివారం ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు.

భూపాలపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కాంగ్రెస్ హామీలు అబద్ధం

- రైతుభరోసా 12 వేలేనా?
- సర్కార్‌పై మాజీ ఎమ్మెల్యే గండ్ర ఫైర్

కృష్ణకాలనీ, జనవరి 5 : 'కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అబద్ధం.. చివరకు వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఎకరానికి రూ.15 వేలు ఇస్తానని మోసం చేసింది' అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓడిపోతామనే భయంతోనే సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదని విమర్శించారు. రైతులు ఆగ్రహంతో ఉన్నారని గ్రహించి.. గత్యంతరం లేక ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా ఇస్తామని ప్రకటించినట్టు తెలిపారు. ఎన్నికల సమయంలో రూ.15 వేలు ప్రకటించి ఏడాది తరువాత రూ.12 వేలు ఇస్తామనడంపై ఆయన భగ్గుమన్నారు. రేవంత్‌రెడ్డి చెప్పిన రకంగా చూస్తే ప్రభుత్వం రైతుకు ఎకరాకు రూ.17,500 రైతుభరోసా కింద బాకీ పడిందని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ కూడా కొద్దిమందికే జరిగిందని పేర్కొన్నారు. రైతుభరోసా, పూర్తిస్థాయిలో రుణమాఫీ, సన్న, దొడ్డ వడ్లకు రూ. 500 బోనస్, వృద్ధులకు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు, మహిళలకు రూ. 2,500, రూ.500కే గ్యాస్, నిరుద్యోగ భృతి, కల్యాణ లక్ష్మి తులం బంగారం పథకాలను ఎప్పుడు ఇస్తారో ప్రకటించి, కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

రైతు భరోసా కోతపై కన్నెర్ర

రేవంత్ సర్కారుకు వ్యతిరేకంగా మంచిర్యాల, కామారెడ్డి జిల్లాల్లో వెలిసిన పోస్టర్లు

మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కొమ్మెరలో రైతుభరోసా అమలు చేయాలని పోస్టర్లతో నిరసన తెలుపుతున్న రైతులు

చెన్నూర్ రూరల్/బాన్సువాడ రూరల్/నస్రుల్లాబాద్, జనవరి 5 : రైతు భరోసా ఎగ్గొట్టే కుట్రలపై రైతులు కన్నెర్ర చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా.. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న రైతు భరోసా హామీని అమలు చేయకపోగా.. తాజాగా ఎకరాకు రూ.12 వేలే ఇస్తామనడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ తీరును నిరసిస్తూ మంచిర్యాల, కామారెడ్డి జిల్లాల్లోని పలు చోట్ల వాల్‌పోస్టర్లు వెలిశాయి. ఎటువంటి షరతులు, కొర్రీలు రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామం, కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బోర్లం, నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ఆదివారం రైతులు వాల్ పోస్టర్లు అంటించారు. 'ఎగ్గొట్టిన రైతు భరోసా ఎప్పుడిస్తావు రేవంత్? 2023 యాసంగిలో ఒక్కో ఎకరాకు ఎగ్గొట్టిన రైతు భరోసా రూ.2500.. 2024 వానకాలంలో రూ.7500.. 2024 యాసంగిలో రూ.7500.. మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుకు ఒక్కో ఎకరాకు బాకీ పడ్డ రైతు భరోసా రూ.17,500 ఇవ్వాలని' పోస్టర్లలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను చూపిస్తూ రైతులు మాట్లాడారు. మళ్లీ సర్వే, దరఖాస్తు స్వీకరణ సాకుతో ఈసారి కూడా రైతు భరోసాను ఎగ్గొట్టే ఆలోచనలో రేవంత్ సర్కారు ఉందని మండిపడ్డారు. వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని వేడుకున్నారు. కాంగ్రెస్ సర్కారు పుణ్యమా అని కర్షకులు వ్యవసాయ కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ మాదిరిగా కాకుండా రైతు భరోసా డబ్బులను ఒక్కసారే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఎకరాకు రూ.7,500 ఇస్తామని, నేడు ఎకరాకు రూ.6 వేలు ఇస్తానడం సిగ్గుచేటని అన్నారు.

రేవంత్ వెలగబెట్టిందేమీ లేదు

బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): రైతులను మోసం చేసి దగా చేయడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణకు వెలగబెట్టిందేమీ లేదని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. రైతు భరోసాను రూ.12 వేలకు తగ్గించి నమ్మకద్రోహం చేశారని ఆదివారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ పచ్చి మోసానికి గణతంత్ర దినోత్సవాన్ని ముహూర్తంగా పెట్టారంటూ మండిపడ్డారు. 'గత పాలకులు చేసిన అప్పు' అంటూ అరిగిపోయిన రికార్డులు మళ్లీ మళ్లీ ప్లేచేసి తప్పించుకునేందుకు చూస్తున్నారని ధ్వజమెత్తారు. గడిచిన 13 నెలల్లో రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి చేసింది సున్నా అని పేర్కొన్నారు.

సాగు యోగ్యమైన భూమి 1.48 కోట్ల ఎకరాలు

మొదటిపేజీ తరువాయి...

కింద ఎకరాకు ప్రతి సీజన్‌లో ఎకరాకు రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15వేలు పెట్టుబడి సాయం ఇస్తామన్నది కాంగ్రెస్ ఎన్నికల హామీ. కానీ, ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఏడాదికి ఎకరాకు పదిహేను వేలు కాకుండా పన్నెండు వేల చొప్పున, అదీ సాగు యోగ్యమైన భూమికి మాత్రమే ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. ఇప్పటికే సాగు యోగ్యమైన భూమి 1.48 కోట్ల ఎకరాలు ఉన్నట్టు వ్యవసాయ శాఖ లెక్క తేల్చినందున ఈ సీజన్‌లో ఎకరాకు రూ.ఆరు వేల చొప్పున రూ.8,880 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంటుంది.

సాగు చేసిన భూమికా? సాగు యోగ్యమైన భూమికా?

మొన్నటివరకు సీఎం రేవంత్‌రెడ్డితోసహా మంత్రులంతా పంట సాగు చేసిన భూమికి మాత్రమే రైతుభరోసా ఇస్తామని బహిరంగంగా ప్రకటించారు. ఇప్పుడేమో సీఎం రేవంత్‌రెడ్డి సాగు యోగ్యమైన భూమికి ఇస్తామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో మొదట చెప్పినట్టుగా పంటలు సాగు చేసిన భూమికి మాత్రమే ఇస్తారా? లేక సాగు ఆమోదయోగ్యమైన భూమికి ఇస్తారా? ఇందులోనూ కోత పెడతారా? అనే సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. పథకాల అమలులో కాంగ్రెస్ సర్కారు కోతలు పెడుతుండటం, పూటకో మాట మాట్లాడుతుండటంతో ఇటువంటి అనుమానాలు తలెత్తుతున్నాయి. ఒకవేళ రేవంత్‌రెడ్డి సర్కారు మళ్లీ మాట తప్పి, సాగు యోగ్యమైన భూమికి కాకుండా కేవలం పంట సాగు చేసిన భూమికి మాత్రమే ఇస్తే, భారీ విస్తీర్ణంలో భూమికి రైతుభరోసా కోత పడటం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సాగు చేసిన భూమికి మాత్రమే రైతుభరోసా ఇస్తే, ఈ యాసంగిలో సుమారు 66-70 లక్షల ఎకరాలకు కోత పడటం ఖాయం.

వ్యవసాయ పంటల సాగు విస్తీర్ణం
1.36 కోట్ల ఎకరాలు

ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం
12 లక్షల ఎకరాలు

మొత్తం సాగు యోగ్యమైన భూమి
1.48 కోట్ల ఎకరాలు

ఎకరాకు రూ. 6వేల చొప్పున రైతుభరోసా ఇస్తే యాసంగికి కావాల్సిన మొత్తం రూ. 8,880 కోట్లు

రైతు భరోసాపై స్పష్టత కరువు

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): రైతు భరోసాపై స్పష్టత లేదని, రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు రాష్ట్ర ప్రజలను నిరాశ పరిచాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా పనిచేస్తుందని విమర్శించారు. పెన్షన్ పెంపు, ఆరు గ్యారెంటీలను పట్టించుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. క్యాబినెట్ నిర్ణయాలు కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు ఉన్నాయని ఎద్దేవా చేశారు. తాను లేవనెత్తిన పలు అంశాలపై స్పందించకపోవడం ప్రభుత్వం తప్పు చేసిందనే దానికి నిదర్శనమని తెలిపారు. హెటిరో స్కాంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయని, సివిల్ సప్లయ్ అక్రమాలపై ఆధారాలు బయటపెట్టినా చర్యలు లేవని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కంపెనీ వ్యవహారంలో ఇప్పటికైనా కళ్లు తెరవాలని, సీఎం రేవంత్ నియోజకవర్గంలోని కొడంగల్ లిఫ్ట్ టెండర్ల గోల్‌మాల్ సంగతేమిటని మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ ధర్నాపై పోలీసు నిర్బంధం

బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె హౌస్ అరెస్ట్

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌ను హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు

గంగాధర, జనవరి 5: రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని నమ్మించి మోసం చేయడంపై కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం తలపెట్టిన ధర్నాపై పోలీసుల నిర్బంధం కొనసాగింది. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ బలవంతంగా అరెస్టు చేసి, ఠాణాకు తరలించారు. హోటల్‌లో కూర్చొని టీ తాగుతున్న బీఆర్‌ఎస్ నాయకులను సైతం వదలకుండా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. రైతుల తరపున పోరాటం చేయడమే తాము చేసిన నేరమా అని బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తమకు కేసులు, జైలు కొత్తకాదని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో రైతుల పక్షాన మరో పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నాయకులను సాయంత్రం వరకు ఠాణాలో నిర్బంధించి సొంత పూచికత్తుపై వదిలిపెట్టారు.

సుంకె హౌస్ అరెస్ట్

గంగాధర మండలం మధురానగర్‌లోని ధర్నాకు బయలుదేరుతున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను బూరుగుపల్లిలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకె పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రైతుల తరపున ప్రజాస్వామ్యయుతంగా పోరాటం చేయడానికి వెళ్తున్న తనను నిర్బంధించడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజా పాలన నడుస్తున్నదా? నిర్బంధ ప్రభుత్వం నడుస్తున్నదా? అని ప్రశ్నించారు. తప్పుడు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏం సాధించారని కాంగ్రెస్ నాయకులు సంబురాలు, క్షీరాభిషేకాలు చేస్తున్నారని నిలదీశారు. ఇచ్చిన హామీలను తప్పినందుకా? రైతు భరోసా ఇవ్వనందుకా? రుణమాఫీని పూర్తిగా అమలు చేయనందుకా? కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇవ్వనందుకా? కాంగ్రెస్ నాయకులు ఎందుకు సంబురాలు చేసుకుంటున్నారో చెప్పాలని ప్రశ్నించారు. హామీలను అమలు చేయని రేవంత్‌రెడ్డిపై చీటింగ్ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ దగా

- రైతుభరోసా.. నయవంచన
- మాజీ ఎమ్మెల్యే రసమయి
- సర్కార్ దిష్టిబొమ్మ దహనం

మానకొండూర్ రూరల్, జనవరి 5 : హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ సర్కార్ ప్రజలను, రైతులను దగా చేస్తున్నదని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మండిపడ్డారు. ఆదివారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలో పల్లెమీద చౌరస్తాలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో రైతు భరోసాకు రూ.12 వేలు ఇవ్వడాన్ని నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ.. రేవంత్ ఇచ్చిన ఇచ్చిన ప్రతి హామీని విస్మరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, నయవంచన అని మరోసారి నిరూపించుకున్నదని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.12 వేలు మాత్ర మే ఇస్తామంటూ మాట మార్చడం సరికాదని అన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చేదాకా ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.